

## బీఆర్ఎస్ గెలుపు కోసం కృషి

ఉగాది పర్వదినాన్ని పురస్కరించు కొని బీఆర్ఎస్ సీనియర్ నాయకు రాలు నివేదితను మంగళవారం కార్ఖానాలోని కార్యాలయంలో బీఆర్ ఎస్ సీనియర్ నాయకుడు, సుబ్ర హ్మణ్య స్వామి ఆలయం పాలక మండలి సభ్యుడు చొల్లేటి రమేష్ మర్యాదపూర్వకంగా కలిసి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం తన వంతు కృషి చేస్తా నని చొల్లేటి రమేష్ తెలిపారు.
– మారేడ్‌పల్లి,ఏప్రిల్ 9

## బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం కల్పించాలి



బీజేపీ పార్టీ సీనియర్ నాయకుడు వర్రి తులసీరామ్ విజయ్ కుమార్

బొల్లారం,ఏప్రిల్ 9: కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నిక బరిలో బీజేపీ పార్టీ నుంచి తనకు అవకాశం కల్పించాలని ఆ పార్టీ సీనియర్ నాయకుడు వర్రి తులసీరామ్ కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న ఉప ఎన్నికలో తనకు పార్టీ అవకాశం ఇస్తే, పోటీ చేసి గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు.తన తండ్రి మూడు పర్యాయాలు పార్లమెంట్ సభ్యుడిగా పనిచేశారని తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సహకారంతో కంటోన్మెంట్ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

## బీజేపీ అభ్యర్థులను గెలిపించుకోవాలి

బొల్లారం,ఏప్రిల్ 9:మల్కాజిగిరి పార్లమెంట్,కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేయడం ఖాయమని బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు భానుక మల్లికార్జున్ అన్నారు.మంగళవారం బోయిన్‌పల్లిలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..రానున్న పార్లమెంట్,కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో బీజేపీ పార్టీ అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో సీనియర్ నాయకులు బీఎన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఆహార ప్యాకెట్ల పంపిణీ



సికింద్రాబాద్,ఏప్రిల్ 9: అన్నదానం కన్నా గొప్పదానం మరొకటి లేదని సికింద్రాబాద్ గంగపుత్ర సంఘం నాయకుడు,సమాజ సేవకుడు బంగారి సాయికృష్ణ అన్నారు. ఉగాది పండుగ సందర్భంగా మంగళవారం సికింద్రాబాద్ పరిధిలోని పలు చోట్ల రోడ్లపై ఉన్న అనాథలకు ఆహార ప్యాకెట్లను పంపిణీ చేశాడు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు.

## ఫోన్ చూడొద్దన్నందుకు..

కాచిగూడ: ఫోన్ చూడొద్దని తల్లి మందలించినందుకు ఓ విద్యార్థి అదృశ్యమైన ఘటన కాచిగూడ పరిధిలో మంగళవారం జరిగింది. ఎస్సై హెచ్. నరేశ్ తెలిపిన వివరాల ప్రకా రం.. నిజామాబాద్‌కు చెందిన బాలాజీరావు కూతురు సీహెచ్. గౌరీ(13) 8వ తరగతి చదువుతుంది. శుభకార్యానికి నాలుగు రోజుల క్రితం నెహ్రూనగర్‌లో ఉండే పిన్ని ఇంటికి కుటుంబ సభ్యులతో కలిసి వచ్చారు. తరుచుగా ఫోన్ చూస్తుండగా చూడవద్దని గౌరీని అన్న, తల్లి మందలించారు. దీంతో మనస్తాపం చెంది ఇంట్లోంచి వెళ్లిన గౌరీ తిరిగి రాకపోవడంతో కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇంట్లోంచి వెళ్లే సమయంలో గౌరీ నలుపు రంగు టాప్, నీలి రంగు జీన్స్ ప్యాంట్ ధరించి, ఎత్తు 4:7 ఉన్నట్లు తెలిపారు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.





## పద్మారావుకు ఉగాది శుభాకాంక్షలు

సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావును మంగళవారం బౌద్ధనగర్ కార్పొరేటర్ కంది శైలజ, బీఆర్ఎస్ నాయకులతో సహా కలిసి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పద్మారావు ఎంపీగా గెలవడం తథ్యమన్నారు. పద్మారావుకు ప్రజలు అత్యధిక సంఖ్యలో ఓట్లు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు.
– ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 9

ఉగాది సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి పద్మారావును సికింద్రాబాద్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు గరికపాటి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పద్మారావును కలిసి ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు.ఈ కార్యక్రమంలో నాయకులు నవీన్‌చారి,రవి తదితరులు పాల్గొన్నారు. సికింద్రాబాద్,ఏప్రిల్ 9:

## మైనార్టీల సంక్షేమానికి కృషి

బొల్లారం,ఏప్రిల్ 9:కంటోన్మెంట్ ఎనిమిదో వార్డు పరిధిలోని బొల్లారం చర్చిలో మంగళవారం కంటోన్మెంట్ పాస్టర్ ఫెలోషిప్, పాస్టర్ జూలియస్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీ గణేష్ హాజరయ్యారు.అనంతరం ఆయన మాట్లాడుతూ..మైనార్టీల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని,రానున్న ఉప ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాస్టర్ ఫెలోషిప్ ప్రధాన కార్యదర్శి మనోహర్,మహేష్,కంటోన్మెంట్ మైనార్టీ చైర్మన్ సామ్సన్,ఆంటోని,జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

## 12నుంచి రామాయణ కథా గానం

సుల్తాన్‌బజార్: కోఠి ఇసామియా బజార్‌లో గల ఆర్యసమాజ్ ఆధ్వర్యంలో మహర్షి దయానంద సరస్వతి జయంతి ఉత్సవాలను ఈ నెల 12నుంచి 17 వరకు నిర్వహిస్తున్నట్లు జయంతి ఉత్సవాల కమిటీ సభ్యుడు డాక్టర్ ధర్మతేజ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజూ సాయంత్రం కథకులు బహన్ అంజలి ఆర్యాచే రామాయణ కథ గానం ఉంటుందని వెల్లడించారు. 17న శ్రీరామనవమిని పురస్కరించుకుని బృహద్ మహాయజ్ఞం, శోభాయాత్ర ఆర్య సమాజ్ ఇసామియా బజార్ చెప్పల్ బజార్ ప్రాంతాల్లో ఊరేగింపు నిర్వహించనున్నట్లు తెలిపారు.

# కొత్త ఆశలు, ఆశయాలతో సాగాలి

### ఉగాది పండుగ సందర్భంగా పలువురు వక్తలు

బేగంపేట్/సికింద్రాబాద్/బన్సీలాల్‌పేట్ /మారేడ్‌పల్లి/ బొల్లారం, ఏప్రిల్ 9: క్రోధి సంవత్సరాది తెలుగు ఉగాది పర్వదిన వేడుకలను మంగళవారం బేగంపేట్ రాంగోపాల్ పేట్ వాసులు ఘనంగా జరుపుకున్నారు. తెలుగు నూతన సంవత్సరం సందర్భంగా యువతీ యువకులు చిన్నారులు పట్టు వస్త్రాలు ధరించి సందడి చేశారు.ఉగాది పండుగ నేపథ్యంలో దేవాలయాలు భక్తులతో కళకళలాడాయి. షడ్రుచులతో తయారు చేసిన ఉగాది పచ్చడి, పూర్ణాలు, ఇతర పిండి వంటకాలతో ఉగాదిని జరుపుకున్నారు.అనంతరం సాయంత్రం పలు దేవాలయలాలో నూతన పంచాంగ శ్రవణాన్ని పటించారు.

**సుభాష్ రోడ్డులో ఉగాది పచ్చడి పంపిణీ**

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి దేవాలయంకు వెళ్లే సుభాష్ రోడ్డులో బాటసారులకు రాంగోపాల్‌పేట్ డివిజన్ స్థానిక బీజేపీ నాయకులు ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సందీప్ వర్మ,ఆకుల ప్రతాప్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

**సికింద్రాబాద్‌లో భక్తి శ్రద్ధలతో ఉగాది వేడుకలు**

ఉగాది పండుగను మంగళవారం సికింద్రాబాద్ ప్రజలు కనుల పండువగా జరుపుకున్నారు.ఉగాది పర్వదినం సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ నిర్వాహకులు ఉగాది పండుగ సందర్భంగా భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేశారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలోని సీతాఫల్‌మండి,అడ్డగుట్ట,మెట్టుగూడ, తార్నాక, బౌద్ధనగర్ తదితర డివిజన్‌ల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉన్న ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి.

**సీతారామ్‌నగర్ రామలింగేశ్వర స్వామి ఆలయంలో..**

సీతాఫల్‌మండి డివిజన్‌లోని సీతారామ్‌నగర్ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఉగాది పండుగను పురస్కరించుకొని భక్తులు పూజా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో పాల్గొన్నారని ఆలయ చైర్మన్ నోముల ప్రకాశ్ తెలిపారు.భక్తుల కోసం ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. కళ్యాణ వేంకటేశ్వర స్వామి,నామాలగుండు వీరాంజనేయ స్వామి ,సాయిబాబా సమేతా బాలాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**బీఆర్ఎస్ ఆధ్వర్యంలో 'ఉగాది' వేడుకలు**

బన్సీలాల్‌పేట్ కార్పొరేటర్ కే.హేమలత లక్ష్మీపతి ఆధ్వర్యంలో 'శ్రీక్రోధి' నామ ఉగాది నూతన తెలుగు సంవత్సర ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఉగాది పచ్చడిని డివిజన్ నాయకులు, కార్యకర్తలకు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తెలంగాణ సాధించిన మాజీ ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్ రావు ఆయురారోగ్యాలతో ఉండాలని, రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధించాలని కోరుకుంటున్నామని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు ప్రేమ్‌కుమార్, నాగభూషణం, అబ్బాస్, కుశాల్, నిఖిల్, మురళి, వెంకటేష్, రంజిత్, రుక్ముద్దిన్, జగదీశ్, రమేశ్, మహేశ్, సాయి, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.



బన్సీలాల్‌పేట: బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఉగాది వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ హేమలత



ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని బొల్లారం హనుమాన్ దేవాలయంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు పంచాంగ శ్రవణం చదివి వినిపించారు.అనంతరం భక్తులకు ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఈఓ మహేందర్‌రెడ్డి,సీనియర్ నాయకులు నరసింహన్,బాల్‌రాజు,బాబు సుందర్ తదితరులు పాల్గొన్నారు.
– బొల్లారం, ఏప్రిల్ 9



ఐదో వార్డులోని మహాత్మాగాంధీనగర్ బస్తీలో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, ఉద్యమకారుడు పెద్దాల నర్సింహ ఉగాది పచ్చడిని పలువురికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బస్తీ వాసులు సత్యనారాయణ, శ్రీనివాస్, యాదగిరి, రాజు, నాగరాజు, మల్లేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. – మారేడ్‌పల్లి, ఏప్రిల్ 9



## అనాథలకు 'ఉగాది' పచ్చడి పంపిణీ

పద్మారావునగర్‌కు చెందిన స్కై ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 'శ్రీక్రోధి' నామ ఉగాది నూతన తెలుగు సంవత్సర ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళవారం కార్యాలయంలో స్కై ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ వై.సంజీవ్ కుమార్, ఉపాధ్యక్షురాలు ఓ.పావనీతో కలిసి సభ్యులు ఉగాది పచ్చడి తయారు చేశారు. అనంతరం వ్యానులో తిరుగుతూ ముఖ్యమైన కూడళ్ల వద్ద ,నిరాశ్రయులు, అనాథలకు ఉగాది పచ్చడి, భక్షాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్కై ఫౌండేషన్ సభ్యులు హరీశ్, అఖిల్, ఇర్ఫాన్‌లు పాల్గొన్నారు. – బన్సీలాల్‌పేట



## కాసాని జ్ఞానేశ్వర్ విజయం సాధించాలి

సికింద్రాబాద్, బోయిగూడలోని ముదిరాజ్ మహాసభ హాలులో మంగళవారం శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన పంచాంగ శ్రవణంలో పాల్గొన్న ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్‌కు వేదపండితులు ఆశీర్వచనం అందజేశారు. బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా చేవెళ్ల నుంచి పోటీ చేస్తున్న ఆయన విజయం సాధించాలని ముదిరాజ్ మహాసభ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. – బన్సీలాల్‌పేట్, ఏప్రిల్ 9



**పచ్చడి పంపిణీ:** న్యూ బోయిన్‌పల్లి బాపూజీనగర్ దేవి నల్లపోచమ్మ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు షడ్రుచుల ఉగాది పచ్చడిని అందజేశారు.ఈ కార్యక్రమంలో బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్,ఆలయ కమిటీ సభ్యులు ప్రేమ్ కుమార్,అజిత్ కళ్యాణ్,శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.– కంటోన్మెంట్,ఏప్రిల్ 9:

## పేకాటరాయుళ్ల అరెస్ట్

కవాడిగూడ, ఏప్రిల్ 9: పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు గాంధీనగర్ పోలీసులు తెలిపారు. ఇన్‌స్పెక్టర్ డి. రాజు వివరాల ప్రకారం.. న్యూబోయిగూడలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకొని ఐదుగురిని పట్టుకొని వారివద్ద నుంచి రూ. 7,400 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపారు.

## ప్రేమిస్తున్నానని మోసం..

బంజారాహిల్స్, ఏప్రిల్ 9: ప్రేమిస్తున్నానని నమ్మించి మోసం చేయడంతో పాటు డబ్బులు తీసుకుని ముఖం చాటేసిన వ్యక్తిపై జూబ్లీహిల్స్ పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. కృష్ణానగర్‌కు చెందిన యువతి(29)కి 2018లో సతీశ్ అనే యువకుడు ఫేస్‌బుక్ ద్వారా పరిచయమయ్యాడు. కొన్నాళ్లు చాటింగ్ చేసుకున్న తర్వాత ఇద్దరి మధ్య స్నేహం ప్రేమగా మారింది. అప్పటినుంచి వారిద్దరూ పలు మార్లు కలుసుకునేవారు. తనకు అవసరం ఉందంటూ యువతి వద్ద నుంచి రూ.1.50లక్షలు తీసుకున్న సతీశ్ ఇటీవల ముఖం చాటేశాడు. తనను మర్చిపోవాలని చెప్పాడు. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించిన బాధిత యువతి జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఐపీసీ 417, 420 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## బండరాయిని ఎత్తిన పాలమూరు మొనగాళ్లు

బన్సీలాల్‌పేట్, ఏప్రిల్ 9 : పద్మారావునగర్‌లోని హమాలీబస్తీలో కూలి పనిచేసే పాలమూరు యువకులు ప్రతి ఏడాది ఉగాది పండుగ రోజున బలప్రదర్శనలో పాల్గొంటారు. అందులో భాగంగా 120 కిలోల బరువున్న బండరాయిని ఎత్తిన వారిని మొనగాడుగా ప్రకటించి సన్మానిస్తారు. 50 ఏండ్ల క్రితం పాలమూరు జిల్లా నుంచి వలస వచ్చి, హమాలీబస్తీలో స్థిరపడిన అనేక మంది నగరంలో కూలి పనిచేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. మంగళవారం శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది పర్వదినం రోజున హమాలీబస్తీ చౌరస్తాలో ఆంజనేయస్వామి దేవాలయం ఎదురుగా ఉన్న మైదానంలో జరిగిన స్వచ్ఛంద పోటీలో 20 మంది పాల్గొనగా విజయ్, శ్రీనివాస్, దాస్ అనే ముగ్గురు యువకులు 120 కిలోల బరువు కలిగిన బండరాయిని విజయవంతంగా భుజంపైకి ఎత్తుకున్నారు. హమాలీబస్తీ నాయకులు విజేతలుగా నిలిచిన ముగ్గురిని సన్మానించి, అభినందించారు.



హమాలీబస్తీలో 120 కిలోల బండరాయిని ఎత్తిన విజయ్ అనే యువకుడు

## మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

ఇఫ్తార్‌లు మత సామరస్యానికి ప్రతీకలుగా నిలుస్తాయని సికింద్రాబాద్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి తీగుళ్ల పద్మారావుగౌడ్ అన్నారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ఆధ్వర్యంలో.. స్థానికంగా ఉన్న ఓ ఫంక్షన్‌హాల్‌లో దావత్-ఇ-ఇఫ్తార్ పేర ముస్లింలకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ హోంమంత్రి మహమూద్ అలీతో కలిసి పద్మారావుగౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు విజయ్‌కుమార్‌గౌడ్, బి.పద్మావెంకటరెడ్డిలతో పాటు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.
అంబర్‌పేట, ఏప్రిల్ 9 :



## శాంతియుతంగా పండుగలను జరుపుకోవాలి

### ఈస్ట్‌జోన్ డీసీపీ గిరిధర్ రావు

హిమాయత్‌నగర్: రంజాన్, హనుమాన్, శ్రీరామ నవమి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకొని మతసామరస్యాన్ని చాటాలని ఈస్ట్‌జోన్ డీసీపీ గిరిధర్ రావుల అన్నారు. మంగళవారం నారాయణగూడ పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పండుగలు, ఉత్సవాలు శాంతియుత వాతావరణంలో జరిగేందుకు మైత్రీ, శాంతి కమిటీలు, ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని తెలిపారు. హనుమాన్ జయంతి ర్యాలీకి కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాట్లు చేయడంతో పాటు అందుబాటులో ఉన్న సీసీ కెమెరాలు, వీడియో కెమెరాలను వినియోగిస్తూ ర్యాలీ శాంతియుతంగా జరిగేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు.
అవాంఛనీయ ఘటనలు జరుగకుండా తగిన ప్రణాళికలు రూపొందించామని పేర్కొన్నారు.

